క్లుప్తంగా

సీఐ వీరబాబుకు సత్కారం



పట్టణ సీఐ వీరబాబును సత్కరించి అభినందిస్తున్న బులియన్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవా పతకం అందుకున్న పట్టణ సీఐ పి.వీరబాబును అమలాపురం బంగారు, వెండి వర్తకుల సంఘం (బులియన్ అసోసియేషన్) ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందించారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో బంగారు వర్తకులు సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అభినందన సత్కార కార్యక్రమంలో పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, బులియన్ అసోసియేషన్ ప్రతినిధులు చింతలపూడి సత్తిబాబు, కొమ్మూరి ప్రసాద్, మానే ప్రకాష్ పాల్గొన్నారు.

కొబ్బరి రైతులకు అండగా ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

అమలాపురం రూరల్: కొబ్బరికి మద్దతు ధర పెంచే విధంగా కృషి చేస్తున్నామని, రైతులకు అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్ నుంచి కాపు కల్యాణ మండపం వరకు సోమవారం భారీ సారథ్యం యాత్ర నిర్వహించారు. అనంతరం కాపు కల్యాణ మండపం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలకు విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ తాటి చెట్టు ఎక్కే గీత కార్మికులకు కొత్త బీమా పథకం కేంద్రం తీసుకు వచ్చిందన్నారు. త్వరలో అమలాపురం రైల్వే స్టేషన్ కలనెరవేరుతుందని అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్రాన్ని బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్ కుమార్, మాజీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొర బాబు, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు సునీల్ కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ పాట్నూరి రామ్మోహనరావు, జాతీయ కౌన్సిల్ మెంబర్ మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా, గుంటూరు, అనకాపల్లి జిల్లాల ఇన్‌చార్జిలు, పట్టణ అధ్యక్షుడు అయ్యల బాషా పాల్గొన్నారు.

సమస్యలపై వినతిపత్రం

అమలాపురం టౌన్: జిల్లా శాలి వాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక షాదీఖానా సమీపంలో వినాయక మట్టి ప్రతిమలను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సోమవారం ప్రజలకు పంపిణీ చేశారు. బీజేపీ నాయకుడు, శాలివాహన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొడ్డిపట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలు సమస్యలపై శాలి వాహన సంఘీయులు మాధవ్‌కు వినతిపత్రం అందించారు. సంఘం అధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మం, కార్యదర్శి గాలిపర్తి భీమేశ్వరరావు, సంఘీయులు పాల్గొన్నారు.

యువత శ్రమదానంతో శ్మశాన వాటికకు దారి

యానాం: చిట్టడవిలా ఉన్న శ్మశాన వాటిక దారిని బాగు చేయించాలంటూ అధికారుల చుట్టూ తిరిగినా స్పందన రాకపోవడంతో ఆ గ్రామ యువత అంతా ఒక్కటై తుప్పలను, పిచ్చిమొక్కలను తొలగించి దారిని ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలో తీర ప్రాంత మత్స్యకార గ్రామమైన సావిత్రినగర్‌లో శ్మశాన వాటిక దారిని కమ్మేస్తూ తుమ్మ ముళ్ల పొదలు పెరిగాయి. అంత్యక్రియల నిర్వహణ సమయంలో మట్టిరోడ్డుపై అవస్థలు ఎదురవుతుండటంతో సోమవారం యువతతో కలసి శ్రమదానం చేసి ముళ్లపొదలను తొలగించి, రహదారిని శుభ్రం చేశామని యువత అధ్యక్షుడు మల్లాడి రాజు, సంగాడి శ్రీను, పాలెపు వీరబాబు తెలిపారు.

సంస్థాగత ఎన్నికలపై విస్తృత స్థాయి సమావేశం

అమలాపురం రూరల్: అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్‌లో సోమవారం టీడీపీ జిల్లా అధ్యక్షురాలు, రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పరిశీలకులు, రాష్ట్ర మైనింగ్, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. సంస్థాగత ఎన్నికల నిర్మాణంపై చర్చించారు. పలువురు జిల్లా అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు అందజేసి పోటీ పడ్డారు. ఏకాభిప్రాయానికి రాకపోవడంతో ఎంపిక ప్రక్రియ వాయిదా వేశారు. అరకొరగా భోజనాలు ఏర్పాటు చేశారని, చాలామంది ఆకలితో అలమటించారని పలువురు కార్యకర్తలు నిర్వాహకుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో గురుకులం

- వేధిస్తున్న మౌలిక వసతుల కొరత
- బాత్‌రూముల్లో నీరు లేక ఆరుబయటే విద్యార్థుల స్నానాలు
- పడకేసిన పారిశుధ్యం



విద్యార్థులు నిద్రించే గదిలో పేరుకుపోయిన చెత్త



వంట పనులు చేస్తున్న విద్యార్థులు

అల్లవరం: అమలాపురం నియోజకవర్గ పరిధి అల్లవరం మండలం గోడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలురు, బాలికల గురుకులాల్లో నిత్యం సమస్యలు వెంటాడుతున్నాయి. ఎన్నో కలలతో వచ్చిన విద్యార్థులకు ఇక్కడి సౌకర్యాలు చూసి విసుగెత్తిపోతున్నారు. గురుకులాల్లోని అరకొర సౌకర్యాలు విద్యార్థులు లక్ష్యానికి ప్రతిబంధకంగా మారుతున్నాయి.

సుమారు వెయ్యికి పైగా విద్యార్థులు

బాలురు, బాలిక గురుకులాల్లో సుమారు వెయ్యికి పైగా విద్యార్థులు 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను అభ్యసిస్తున్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి పేద కుటుంబాలకు చెందిన పిల్లలు మాత్రమే గురుకులాల్లో చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సౌకర్యాలు లేవు. రెండు గురుకులాల్లో కాంట్రాక్టు, ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నారు. బాలురు గురుకులంలో కాంట్రాక్టు సిబ్బందే ప్రిన్సిపాల్ హోదాలో విధులు నిర్వర్తిస్తున్నారు.

దయనీయంగా విద్యార్థుల పరిస్థితి

మరుగుదొడ్ల సమస్య విద్యార్థులను దీర్ఘకాలంగా వేధిస్తోంది. మరుగుదొడ్లకి తలుపులు లేకపోవడం, స్నానపు గదులు, మరుగుదొడ్లలోకి నీరు రాకపోవడం, కిటికీలకు దోమలు మెస్‌లు లేకపోవడం విద్యార్థులను వేధిస్తున్నాయి. గురుకులంలోని స్నానపు గదుల్లోకి నీరు రాకపోవడంతో ఆరుబయట స్నానాలు చేయాల్సిన పరిస్థితి బాలురు గురుకులంలో నెలకొంది. చేతులు కడుక్కోవడానికి అవసరమైన నీరు హ్యాండ్‌వాష్ బేసిన్‌లోకి రాకపోవడంతో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. వారం రోజులైనా విద్యార్థులు నిద్రించే రూముల్లో చెత్తా చెదారాన్ని శుభ్రం చేయకుండా శానిటేషన్ వర్కర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. విద్యార్థులకు అందించే భోజనాల్లో నాణ్యత లేదని, నాసిరకం కూరగాయలను వండి వడ్డిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో కలలతో గురుకులానికి వచ్చామని అడుగడునా సమస్యలు వెంటాడుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

> **ఉన్నతాధికారులు దృష్టి సారించాలి**
>
> గురుకులంలో విద్యార్థులను వెంటాడుతున్న సమస్యలపై ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లినా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. డీసీఓ దృష్టికి తీసుకెళ్లినా నేటికీ గురుకులాన్ని ఆమె పరిశీలించిన దాఖలాల్లేవు. చూడటానికి మేడి పండులా బాలుర గురుకులం ఉన్నా లోపల మాత్రం వ్యవస్థ అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల బాగోగులపై దృష్టి సారించాలి.
>
> – బి.భరత్‌కుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్, గోడి బాలురు గురుకులం

ప్రమాదాలను నివారించాలి



కాకినాడ కలెక్టరేట్ వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న అఖిలపక్ష నాయకులు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం అఖిలపక్ష నాయకులు కలెక్టర్ సగిలి షణ్మోహన్, ఎస్పీ బిందుమాధవ్‌ను కలసి వినతిపత్రాలు అందజేసారు. ఎన్‌హెచ్‌లో రెండు నెలల వ్యవధిలో 10 ప్రమాదాలు సంభవించి 12 మంది మృత్యువాత పడ్డారని పేర్కొన్నారు. ప్రధానంగా రహదారి నిర్మాణం అసంపూర్తిగా ఉండడం, అతివేగం, విచ్చలవిడిగా మద్యం సేవించి వాహనాలను నడపడం తదితర కారణాలతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదాల నివారణకు కాకినాడ నుంచి అమలాపురం వరకు పైలట్ ప్రాజెక్టు ప్రారంభించాలని, రేడియం సిగ్నల్స్,బ్లాక్‌స్పాట్ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. నాలుగులేన్ల పనులను తక్షణమే చేపట్టి డివైడర్లు ఏర్పాటు చేయాలని, హైవే చెంతన ఉన్న మద్యం దుకాణా లను తొలగించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, సర్పంచ్‌లు ముద్దన వెంకట శివరామప్రసాద్, వెంటపల్లి నూకరాజు, పంపన రామకృష్ణ, శాఖ శంకరుడు, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రయ్య చొరవ అభినందనీయం



ఎన్టీఆర్ రూపంలో శ్రీకృష్ణుని విగ్రహం ఏర్పాటును ఖండిస్తున్న అమలాపురం నియోజకవర్గ యాదవ సంఘ ప్రతినిధులు

అమలాపురం టౌన్: గుంటూరు జిల్లా తక్కెళ్లపాడులో ఎన్టీఆర్ రూపంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి విగ్రహాన్ని తన ఉద్యమ స్ఫూర్తితో తొలగించిన యాదవ నాయకుడు బోడే రామచంద్రయ్య చొరవ అభినందనీయమని అమలాపురం నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు కైల శోభన్‌బాబు అన్నారు. స్థానిక గొల్లగూడెంలో శోభన్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ యాదవ సంఘం సమావేశం ఎన్టీఆర్ రూపంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని ఖండించింది. గ్రామంలో ఆ తరహా విగ్రహం ఏర్పాటును రామచంద్రయ్య తీవ్రంగా వ్యతిరేకిస్తూ యాదవులకు చలో తక్కెళ్లపాడు పిలుపునిచ్చి ఈ విషయంలో విజయం సాధించారని సమావేశం పేర్కొంది. యాదువుల, హిందువుల మనోభావాలను కాపాడిన రామచంద్రయ్యకు నియోజకవర్గ సంఘం కృతజ్ఞతలు తెలిపింది. గతంలో హైకోర్టు కూడా దేవుని రూపంలో మానవ విగ్రహాలను పెట్టవద్దని తీర్పు ఇచ్చిన విషయాన్ని సమావేశంలో పలువురు గుర్తు చేశారు. సమావేశంలో యాదవ సంఘం నాయకులు మట్ట రాంబాబు, కానుబోయిన దుర్గా ప్రసాద్, సూరిబోయిన సుబ్రహ్మణ్యం, మేకల వెంకటేశ్వరరావు, నాగళ్ల రెడ్డమ్మ, చిట్టిమేను దుర్గబాబు తదితరులు ప్రసంగించారు.

సేవా పురస్కార గ్రహీతలకు సత్కారం



పంచాంగ కర్త నాగాదిత్య దంపతులను సత్కరిస్తున్న ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. ఇటీవల హైదరాబాద్ లలిత కళా సేవా సమితి నుంచి పంచాగ వైభవ రత్న పురస్కారాన్ని అందుకున్న పట్టణానికి చెందిన పంచాంగ కర్త, పురోహిత బ్రహ్మ ఉపద్రష్ట నాగాదిత్య దంపతులను, స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవా పతకం అందుకున్న పట్టణ సీఐ పి.వీరబాబును ఈ సందర్భంగా ఆర్యవైశ్య సీనియన్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సత్కార సభలో అసోసియేషన్ ముఖ్య సలహాదారు నంబూరి విశ్వనాథం, సంయుక్త కార్యదర్శి వరదా రాంబాబు, కోశాధికారి శ్రీఘాకోళపు రాంపండు, కో ఆర్డినేటర్ నంబూరి శ్రీనివాస్, పట్టణ వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, సుబ్బాలమ్మ దేవస్థానం చైర్మన్ అప్పన వీరన్న, వరదా సూరిబాబు తదితరులు సీఐ వీరబాబు, పంచాంగ కర్త నాగాదిత్య అందిస్తున్న సేవలను కొనియాడారు.

సబ్ ట్రెజరీ అధికారిగా కృష్ణ బాధ్యతల స్వీకరణ



ఎస్టీవో కృష్ణను అభినందిస్తున్న జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం సబ్ ట్రెజరీ అధికారి (ఎస్టీవో)గా కోలా కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ముమ్మిడివరం ఎస్టీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కృష్ణ పదోన్నతిపై అమలాపురం ఎస్టీవోగా బదిలీ అయ్యారు. స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు సాయివరప్రసాద్ ఆధ్వర్యంలో పెన్షనర్లు ఎస్టీవో కృష్ణను స్థానిక ట్రెజరీ కార్యాలయంలో సోమవారం కలసి అభినందించి సత్కరించారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తానని ఎస్టీవో వారికి హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు సాయి వరప్రసాద్‌తో పాటు ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు, జిల్లా సంఘం ప్రతినిధులు కలిగినీడి ఉదయ భాస్కర్, మెహబూబ్ షహీరా, మంగిపూడి శ్రీరామచంద్రమూర్తి, పప్పుల శ్రీరామచంద్రమూర్తి తదితరులు ఎస్టీవో కృష్ణను కలసి అభినందించారు. కార్యక్రమంలో ట్రెజరీ కార్యాలయ సిబ్బంది డి.పృథ్వీరాజ్, ధన రామకృష్ణ, బ్రహ్మాజీ, భవాని పాల్గొన్నారు.

పింఛన్‌దారులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు



అమలాపురంలో పెన్షనర్ల ఆందోళనలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్: ఉద్యోగ ఉపాధ్యాయ వికలాంగ, వితంతు వృద్ధాప్య పింఛన్లు బూటకపు హామీలతో రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడానికి పింఛన్లను ఒక సాధనంగా వాడుకుంటున్నాయని మాజీ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. రాజకీయ పార్టీలు, నాయకులు అధికారం చేపట్టిన తరువాత పింఛనుదారుల సమస్యలను గాలికి వదిలేస్తున్నారని ఆయన అన్నారు. ఆల్ ఇండియా కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఈపీఎస్ పెన్షనర్ల సంఘాల సంయుక్త కమిటీ పిలుపు మేరకు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నల్ల వంతెన వద్ద ధర్నా నిర్వహించారు. కోనసీమ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, ఈపీఎస్-95 పెన్షనర్లు పాల్గొన్నారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ ఐవీ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు అధికారంలోకి రావడానికి బూటకపు హామీలిస్తూ ప్రజలను, ఉద్యోగులను, కార్మికులను మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ ధర్నాను ఉద్దేశించి పెన్షనర్ల జిల్లా అధ్యక్షుడు కదలి సత్యనారాయణ కార్యదర్శి గుబ్బల గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈపీఎస్ 95 పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు, డీఏతో కలిపి చెల్లించాలని డిమాండ్ చేసారు. గౌరవ అధ్యక్షుడు శ్రీరాంమూర్తి, కోశాధికారి పి.భాస్కరరావు కార్యదర్శులు ఎం.వెంకటేశ్వరరావు, పంతాని రామకృష్ణ, భానోజీ రావు, నాయకత్వం వహించారు.ఈ ఆందోళనకు కే రెడ్డివీరాస్వామి, జనిపల్లి సత్యనాయణ తదితరులు మద్దతు తెలిపారు.

స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు, 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని కలెక్టర్ కార్యాలయం వద్ద బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. బీఎస్పీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు భూషి జాన్ మోషే, జిల్లా ఇన్‌చార్జ్ వాకపల్లి భీమారావు, ఉపాధ్యక్షుడు జిత్తుక సత్యనారాయణ, అమలాపురం నియోజకవర్గం ఇన్‌చార్జి పొలమూరి మోహన్ బాబు, అధ్యక్షుడు పెండెం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా ఉత్సవాలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ త్రినాథరావు

తాళ్లరేవు: వినాయక చవితి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని తహసీల్దార్ పితాని త్రినాథరావు కోరారు. సోమవారం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి పందిళ్లు, మండపాల ఏర్పాటుకు ఉత్సవ కమిటీగా ఏర్పడి పోలీసు అనుమతి తీసుకోవాలని కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. వినాయక మండపాల వద్ద ప్రత్యేక పారిశుద్య చర్యలు చేపట్టనున్నట్లు ఎంపీడీఓ కె.సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ అనూష, మత్స్యశాఖ ఏఈ అనూరాధ, డీటీ సూరిబాబు, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

అన్ని సామాజిక వర్గాలకు పరిహారం ఇవ్వాలి

యానాం: దరియాలతిప్ప వద్ద ఐలాండ్-3 సమీపంలో జరిగిన గ్యాస్ పైప్‌లైన్ లీకేజీ వల్ల జరిగిన అగ్నిప్రమాదం ఘటనలో కేవలం మత్స్యకారులకు మాత్రమే నష్టం వాటిల్లినట్టు కొంతమంది నాయకులు ప్రచారం చేస్తున్నారని, అక్కడ ఉన్న అన్ని వర్గాలూ బాధితులేనని సోమవారం పలువురు స్థానికులు తెలిపారు. చమురు సంస్థల ద్వారా మత్స్యకారులు క్రమం తప్పకుండా రూ.కోట్లు పరిహారం పొందుతున్నారని, చమురు సంస్థల పైప్‌లైన్ వెంబడి ఉన్న మిగిలిన సామాజిక వర్గాల వారికి ఎటువంటి పరిహారం చెల్లించడం లేదని వారన్నారు. ఇటీవల బ్లోఅవుట్ ప్రమాదం వల్ల దరియాలతిప్ప, సీతారాంనగర్, దొమ్మేటిపేట ప్రాంతాలు పూర్తిగా కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయని, తాగు నీరు కలుషితమైందని, దీర్ఘకాలిక వ్యాధులకు పలువురు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కుల, మత తారతమ్యం లేకుండా బాధితులందరికీ పరిహారం అందించాలని ఆయా గ్రామాల పెద్దలు, ప్రజలు కోరారు.

మహిళపై దాడి కేసులో వ్యక్తి అరెస్ట్

అమలాపురం టౌన్: పేరూరు శివారు లంకతోటకు చెందిన జల్లి మంగాదేవిపై దాడి చేసి గాయపరిచిన ఘటనలో అదే గ్రామానికి చెందిన పులిదిండి వెంకట్రావును పట్టణ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈనెల 21న జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పట్టణ సీఐ పి.వీరబాబు వెల్లడించారు. మంగాదేవి దుస్తులు ఆరేసుకున్న ప్రాంతంలోనే వెంకట్రావు తన ఆవును మేపడంతో ఆమె అభ్యంతరం చెప్పింది. వెంకట్రావు దాడి చేయడంతో మంగాదేవి ముఖంపై గాయాలుకాగా నాలుగు పళ్లు ఊడిపోయాయి. ఈ నేరంపై వెంకట్రావును కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు పట్టణ ఎస్సై మనోహర్ జోషి తెలిపారు. నిందితుడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

బొక్కుసార వారోత్సవాలు ప్రారంభం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీ సిబ్బంది

తాళ్లరేవు: అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ బొక్కుసార (వేల్ షార్క్) వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చొల్లంగిలోని కోరంగి సీబీఈటీ (కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం) కేంద్రంలో ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ ఆదేశాల మేరకు పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు బొక్కుసార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు కె.ధనుంజయరావు, మహేష్, గోపి, సంధ్యారాణి, ధనలక్ష్మి, సీబీఈటీ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలు ప్రతిష్ఠించాలి



మట్టి ప్రతిమలను ప్రజలకు పంపిణీ చేస్తున్న డీఎస్పీ ప్రసాద్ తదితరులు



వినాయక చవితి ప్రచార వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్: మట్టి వినాయక విగ్రహాలతోనే రానున్న చవితి పండుగలో ప్రజలు పూజలు చేసి పర్యావరణాన్ని కాపాడాలని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణ ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరు, గాంధీనగర్‌లో సోమవారం నిర్వహించిన మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. డీఎస్పీ ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు, ముఖ్య సలహాదారు నంబూరి విశ్వనాథం, కార్యదర్శి నూలు సూర్య ప్రభాకరరావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు వరదా సూరిబాబు పాల్గొన్నారు.

కోనసీమ ఆహార నిధి వితరణ

కోనసీమ ఆహార నిధి ఆధ్వర్యంలో స్థానిక మహిపాల వీధి, ఈదరపల్లిలోని వినాయక ఆలయాల వద్ద సోమవారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కోనసీమ ఆహార నిధి ప్రతినిధులు గట్టెం వీరు, బండారు సురేష్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో వితరణ శీలి నల్లా శ్రీధర్, మాజీ కౌన్సిలర్ తిక్కిరెడ్డి నేతాజీ తదితరులు మట్టి విగ్రహాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో చిక్కం కృష్ణ, జనిపిరెడ్డి శ్రీహరి, మోటూరి కనకదుర్గ, చింతపల్లి చిన్నా పాల్గొన్నారు.

పర్యావరణ హితం..మట్టి గణపతి విగ్రహాలు

అమలాపురం రూరల్: పర్యావరణానికి ముప్పు హాని కలిగించకుండా గణపతి ఉత్సవాలను జరుపుకోవడానికి మట్టి విగ్రహాలను ఉపయోగించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలకు మట్టి ప్రతిమలను ఉపయోగించాలంటూ రూపొందించిన వినాయక చవితి వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎఈ బి.శ్రీ పణీత పాల్గొన్నారు.


వేతనాల కోసం మున్సిపల్ సిబ్బంది ధర్నా



ధర్నాలో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది

యానాం: వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు యానాం మున్సిపాలిటీ సిబ్బంది సోమవారం స్థానిక ఆర్ఏఓ ఆఫీసు సమీపంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 నెలలుగా ప్రభుత్వం తమకు వేతనాలు చెల్లించడం లేదని తక్షణం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కొంత కాలంగా జీతాలు అందక ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి పెన్షన్ అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మున్సిపల్ సిబ్బంది పరిస్థితిపై ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటు



వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్

అల్లవరం: దేవగుప్తం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా విశేష సేవలందించిన సీనియర్ పార్టీ నాయకులు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు (దడేల్) పార్టీకి తీరని లోటు అని మాజీ మంత్రి, పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే విశ్వరూప్ అన్నారు. దేవగుప్తంలో సోమవారం వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన విశ్వరూప్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీపీ ఇళ్ల శేష గిరిరావు, సర్పంచ్ సాధనాల వెంకటరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతా రామకృష్ణ, పాటి శ్రీరామ్, పాటి సత్యనారాయణ, పినమాల విక్రమ్, చిట్టూరి వెంకటనారాయణ ఉన్నారు.

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



ముంపు బాధితులను ఆరా తీస్తున్న ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు డీబీలోక్

అల్లవరం: బోడసకుర్రు పల్లిపాలెంలో ఇటీవల వరద ప్రభావంతో ముంపుబారిన పడిన కుటుంబాలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భారత రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు డీబీ లోక్ అన్నారు. వరద ప్రభావిత ప్రాంతంలో ముంపు బాధితులను ఆర్‌పీఐ బృందం సోమవారం పరామర్శించారు. వరద ప్రభావంతో మత్స్యకారుల ఇళ్లు నీట మునిగితే కనీసం పట్టించుకోలేదని, భోజనాలు, తాగునీరు ఇవ్వలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీబీ లోక్ మాట్లాడుతూ బోడసకుర్రు పల్లిపాలెం తరుచుగా వరద బారిన పడకుండా ఉండాలంటే గ్రామానికి ఆనుకుని రక్షణ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ నిర్వహించాలని, ముంపు కుటుంబాలను ప్రభుత్వ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ముంపు ప్రాంతంలో కటికదల సత్యనారాయణ, పెయ్యల శ్రీనివాసరావు, జంగా రాజేంద్ర, గెద్దం బాలకృష్ణ, సాంబశివరావు, ఉండ్రు శ్యామలరావు, డి.నాగేశ్వరరావు పర్యటించారు.